క్లుప్తంగా

పారదర్శకంగా 'వైఎస్సార్ కల్యాణమస్తు'



లబ్ధిదారుకు కల్యాణమస్తు చెక్కు అందజేస్తున్న ఏపీఎం గోవిందరావు

రేగిడి: వైఎస్సార్ కల్యాణమస్తు పథకాన్ని పూర్తి పారదర్శకంగా అమలు చేస్తున్నామని, అర్హులకు ఈ పథకం కింద కచ్చితంగా లబ్ధి చేకూరుతుందని వైకేపీ ఏపీఎం పి.గోవిందరావు అన్నారు. మండలంలోని సంకిలి గ్రామంలో వైఎస్సార్ కల్యాణమస్తు పథకం లబ్ధిదారు కొయ్యాన భారతికి సోమవారం రూ.50 వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బుడుమూరు పట్టాభి, ఎంపీటీసీ మజ్జి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

గురవాంలో గ్రామసభ



గ్రామసభలో వివరాలు వెల్లడిస్తున్న డీఆర్పీ దొర

రాజాం: మండలంలోని గురవాం గ్రామంలో మూడురోజులుగా చేపట్టిన 16వ సోషల్ ఆడిట్‌పై సోమవారం గ్రామసభ నిర్వహించారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో గురువాం పంచాయతీలో రూ.68 లక్షలతో 32 పనులు చేపట్టినట్లు డీఆర్పీ దొర తెలిపారు. ఆయా నిధుల వినియోగం, రికార్డులు, ఎం–బుక్‌లు, పనులను పరిశీలించినట్లు చెప్పారు. గ్రామ సభలో సేకరించిన వివరాలను వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బాసూరి శంకరరావు, ఏపీఓ సాయిరాం, ఎస్ఆర్పీ ఎస్.చిన్నబ్బాయి, గ్రామ సచివాలయ ఉద్యోగులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శ



ఈశ్వరమ్మ కుటుంబాన్ని పరామర్శిస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ జగన్మోహనరావు

సంతకవిటి: మండలంలోని మిర్తివలస గ్రామానికి చెందిన పాండ్రంకి శ్రీరాములునాయుడు భార్య ఈశ్వరమ్మ ఇటీవల మరణించింది. విషయం తెలుసుకున్న జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు సోమవారం ఆ గ్రామానికి వెళ్లి మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమె మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట ఎంపీటీసీ రాజాపు రమణ, స్థానిక నాయకులు ఉన్నారు.

అంబఖండిలో 'వికసిత్ భారత్'



ప్రకృతి సాగుపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

రేగిడి: మండలంలో అంబఖండి గ్రామంలో సోమవారం 'వికసిత్ భారత్ సంకల్పయాత్ర' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై పంచాయతీ కార్యదర్శి హేమసుందరరావు గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అర్హులు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలు సాగుచేయడం వల్ల కలిగే ప్రయోజనాలను ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ శాసపు గోవిందనాయుడు, ఎంపీటీసీ పుర్లి సత్యవతి, వ్యవసాయశాఖ సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రామాలయం ప్రారంభానికి సిద్ధం



శ్రీరామ మందిరం

మెంటాడ: మండల కేంద్రంలోని ఎగువవీధిలో నిర్మాణం పూర్తిచేసుకున్న రామ మందిరం ప్రారంభానికి సిద్ధమైంది. గ్రామస్తులు, పలువురు దాతల ఆర్థిక సహకారంతో ఈ ఆలయాన్ని నిర్మించారు. అయోధ్యలో రామ మందిరం ప్రారంభం రోజునే ఈ ఆలయాన్ని ప్రారంభించనున్నట్లు గ్రామ పెద్దలు చెపుతున్నారు. ఈలోగా మిగిలిన పనులు పూర్తిచేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయనున్నట్లు తెలిపారు.

కరుణామయుడు ఏసు

బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో క్రిస్మస్ పండగను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. చర్చిలను విద్యుత్ కాంతులతో అలంకరించారు. ఏసుక్రీస్తు దివి నుంచి భువికి రాకను స్వాగతిస్తూ క్రీస్తు విశ్వాసకులు ఆదివారం అర్ధరాత్రి నుంచే ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత పెద్దలు, బోధకులు క్రీస్తు సువార్తను వినిపించారు. లోకరక్షకుడు, కరుణామయుడైన ఏసుక్రీస్తు బోధనలను ప్రతి ఒక్కరూ అనుసరిస్తూ సేవామార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. యువతీ యువకులు భక్తిగీతాలు ఆలపించారు. చిన్నారులు క్రిస్మస్ తాత (శాంతాక్లాజ్) వేషధారణలతో ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ సందడి చేశారు. పలుచోట్ల పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. రాజాం పట్టణంలోని బొబ్బిలి రోడ్డులో ఉన్న ఆర్‌సీఎం చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే కంబాల జోగులు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్



రామభద్రపురం: చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



తెర్లాం: కూనాయవలస క్రీస్తు ప్రార్థనా మందిరంలో క్రిస్మస్ తాత వేషధారణలో చిన్నారులు



వంగర: కొప్పరవలస చర్చిలో ప్రార్థనలు



సంతకవిటి: జీఎన్‌పురంలో రేమా బ్లెస్సింగ్ చర్చిలో దుస్తులు పంపిణీ చేస్తున్న కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ జి.స్వామినాయుడు



రాజాం: బొద్దాం కారుణ్య బాప్టిస్టు చర్చిలో క్రిస్మస్ వేడుకల్లో పాస్టర్ రత్నరాజు, ప్రజా ప్రతినిధులు



తెర్లాం: కూనాయవలస చర్చిలో నృత్యాలు చేస్తున్న చిన్నారులు



బొబ్బిలి: బొబ్బిలి ఆర్‌సీఎం చర్చిలో ఆకట్టుకున్న శాంతాక్లాజ్



బాడంగి: డొంకినవలస చర్చిలో బైబిల్ వాక్యాలు చెపుతున్న పాస్టర్ స్టీవెన్‌సన్



బొబ్బిలి: అలజంగిలో పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న క్రీస్తు విశ్వాసకులు



రాజాం సిటీ: సారథి రోడ్డులోని ఏసుకృపా నిలయం చర్చిలో కేక్ కట్ చేస్తున్న విశ్వాసకులు



రేగిడి: అంబఖండి చర్చిలో ప్రార్థనలు చేస్తున్న పాస్టర్ పాల్

500 మంది పేదలకు వస్త్రదానం

రామభద్రపురం: క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని మండలంలోని ఆరికతోటలో విశ్రాంత ఎంఈఓ జార్జ్ పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ముందుగా స్థానిక ఏడీఎంఎం చర్చిలో క్రిస్మస్ ప్రార్థనలు చేశారు. అనంతరం చిన్నారులకు బహుమతులు, సుమారు 500 మంది పేదలకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జార్జి మాట్లాడుతూ.. ఉద్యోగ విరమణ చేసినప్పటి నుంచి ఏటా క్రిస్మస్ పర్వదినం నాడు పేదలకు దుస్తులు, భోజనాలు అందిస్తున్నానని అన్నారు. పేదలకు సాయం చేయడంలో ఉన్న సంతృప్తి మరెందులోనూ ఉండదని అన్నారు. ప్రతి ఒక్కరూ సేవాభావం అలవర్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో చర్చ ఫాదర్ రెవ్ ఎస్.ఇజ్రాయెల్, సురేష్‌కుమార్, చంద్రశేఖర్, పి.భీమయ్య పాల్గొన్నారు.



పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న జార్జి

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక

రామభద్రపురం: అర్హులైన ప్రతి ఒక్కరికీ వైఎస్సార్ పింఛన్ కానుక అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీడీఓ రమామణి అన్నారు. పింఛన్ కోసం వచ్చిన దరఖాస్తులను సోమవారం ఆమె పరిశీలించారు. పింఛన్ల మంజూరు కోసం కొత్తగా 180 దరఖాస్తులు అందాయని, వాటిని పరిశీలించి అర్హులకు పింఛన్ మంజూరు చేయనున్నట్లు చెప్పారు. పింఛన్లు మంజూరైన వారికి జనవరి నెల నుంచి నగదు అందజేయడం జరుగుతుందన్నారు. లబ్ధిదారుల ఎంపిక పూర్తి పాదర్శకంగా చేపడుతున్నట్లు చెప్పారు. ఈఓపీఆర్డీ వెంకటరమణ, ఎంఈఓ తిరుమలప్రసాద్ ఉన్నారు.



పింఛన్ దరఖాస్తులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రమామణి

వాజ్‌పేయి చిరస్మరణీయులు



పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

బొబ్బిలి: మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి చిరస్మరణీయులని బీజేపీ సీనియర్ నాయకుడు పుల్లెల శ్రీనివాసరావు అన్నారు. వాజ్‌పేయి జయంతి సందర్భంగా పట్టణంలోని పేదలకు సోమవారం దుస్తులు పంపిణీ చేశారు. బీజేపీ ప్రతినిధులు సాలా అశోక్, గోనా ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

పల్లకీ సేవ



వైభవ వేంకటేశ్వరాలయంలో పల్లకీ సేవ

బొబ్బిలి: ధనుర్మాసం సందర్భంగా దేవదేవునికి కాగడా హారతినిచ్చారు. పట్టణంలోని సింగారపువీధి వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయం స్వామివారి నామస్మరణతో మార్మోగింది. స్వామివారికి పల్లకీ సేవ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

లైన్‌సోయింగ్ పద్ధతితో అధిక దిగుబడి

రాజాం సిటీ: ప్రకృతి వ్యవసాయ విధానంలో గులిరాగి సాగుచేయడం ద్వారా అధిక దిగుబడి పొందవచ్చని ఎంటీ కిరణ్‌కుమార్, ఎల్1 రమాదేవి సూచించారు. మండలంలోని పొగిరి పంచాయతీ బొడ్డవలసలో ప్రకృతి సాగులో భాగంగా లైన్‌సోయింగ్ పద్ధతిలో నాట్లు వేసే విధానంపై సోమవారం రైతులకు అవగాహన కల్పించారు. గులిరాగి సాగులో మెళకువలను వివరించారు. ముందుగా నేలను తేలికపాటి దుక్కి చేసుకుని ఘన జీవామృతాన్ని చల్లుకోవాలి. నారును భీజామృతంలో శుద్ధి చేసి లైన్‌సోయింగ్ పద్ధతిలో నాట్లు వేసుకోవాలని సూచించారు. ఇలా చేయడం వల్ల అధికంగా పిలకలు రావడంతో పాటు దిగుబడి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీలు పాత్రుని వెంకటరమణ, నిర్మల పాల్గొన్నారు.



లైన్‌సోయింగ్ విధానంలో నాట్లు వేస్తున్న రైతులు

రుణాలను సద్వినియోగం చేసుకోండి



వెంకటరంగారాయపురంలో మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఏపీఎం గోవిందరావు

రేగిడి: డ్వాక్రా సంఘాలకు బ్యాంకుల ద్వారా మంజూరు చేస్తున్న రుణాలను సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం గోవిందరావు అన్నారు. మండలంలో వెంకటరంగారాయపురం, కొత్తచెలికానివలస, పాతచెలికానివలస తదితర గ్రామాల్లో మహిళా సంఘాల సభ్యులతో సోమవారం సమావేశాలు నిర్వహించారు. స్త్రీనిధి, ఏఎంఈజీపీ, బ్యాంకు లింకేజీ రుణాలపై అవగాహన కల్పించారు. తీసుకున్న రుణాలతో జీవనోపాధి యూనిట్లు నెలకొల్పి ఆర్థికంగా బలోపేతం కావాలని, రుణాలను సకాలంలో తిరిగి చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామైఖ్య సంఘాల మహిళలు, వైకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి క్రీడా సంబరాలు

- 'ఆడుదాం ఆంధ్రా'ను విజయవంతం చేయాలి
- ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

బొబ్బిలి: గ్రామీణ యువతలోని క్రీడా నైపుణ్యాలను వెలికితీసి వారిని ప్రోత్సహించేందుకు 'ఆడుదాం ఆంధ్రా' ఆటల పోటీలను రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని, ప్రతి ఒక్కరూ ఈ పోటీల్లో పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రోజంతా మానసికంగా ఉల్లాసంగా ఉండేందుకు క్రీడలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. యువత క్రీడల్లో రాణించడం ద్వారా ఉద్యోగావకాశాలు మెరుగుపడతాయన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు, జేసీఎస్ మండల ఇన్‌ఛార్జి తమ్మిరెడ్డి దామోదరరావు, బాడంగి జెడ్పీటీసీ సభ్యుడు పెద్దింటి రామారావు, రామభద్రపురం వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు ఏక్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం: క్రీడాకారులను ప్రోత్సహించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి అన్నారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు సోమవారం 'ఆడుదాం ఆంధ్రా' ర్యాలీ నిర్వహించారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించేందుకు నిర్వహిస్తున్న ఈ క్రీడా పోటీల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని ప్రతిభ కనబరచాలన్నారు. ర్యాలీలో ఎంపీడీఓ రమామణి, పంచాయతీ కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

బాడంగి: మండలంలోని ఏడు హైస్కూల్ మైదానాల్లో నేటి నుంచి 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఆంజనేయులు తెలిపారు. పోటీల నిర్వహణ ఏర్పాట్లను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మండలంలో మొత్తం 3,650 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, క్రికెట్, బ్యాడ్మింటన్ విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. బాడంగి హైస్కూల్ మైదానంలో ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు పోటీలను ప్రారంభిస్తారన్నారు.

తెర్లాం: మండల కేంద్రమైన తెర్లాంలో 'ఆడుదాం ఆంధ్రా' ఆటల పోటీలకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నుంచి క్రీడా పోటీలను ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే మైదానాలను సిద్ధం చేశారు. పాఠశాలల పీడీలు, పీఈటీలను పోటీల పర్యవేక్షకులుగా నియమించారు.

సంతకవిటి: మండలంలోని 24 సచివాలయాల పరిధిలో నేటి నుంచి 'ఆడుదాం ఆంధ్రా' ఆటలు పోటీలు ప్రారంభం కానున్నాయి. హొంజరాం, సంతకవిటి, మందరాడ, జి.ఎస్.పురం, సిరిపురం, వాల్తేరు, కొండగూడెంలోని మైదానాలలో ఈ పోటీల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేశారు.



బొబ్బిలి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



బాడంగి: పాల్తేరు హైస్కూల్ మైదానాన్ని చదును చేయిస్తున్న సర్పంచ్



సంతకవిటి: హొంజరాంలో క్రికెట్ ఫీల్డ్‌ను పరిశీలిస్తున్న సర్పంచ్ హరిబాబు



తెర్లాం: స్థానిక హైస్కూల్ మైదానంలో షటిల్ బ్యాడ్మింటన్ కోర్టును తయారు చేస్తున్న పీడీ, వలంటీర్లు



రామభద్రాపురం: 'ఆడుదాం ఆంధ్రా' ర్యాలీలో ఎంపీపీ లక్ష్మణరావు, జెడ్పీటీసీ సరస్వతి, ఎంపీడీఓ రమామణి, తదితరులు

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

బొబ్బిలి: వైఎస్సార్‌సీపీ రామభద్రపురం మండల యువజన విభాగం అధ్యక్షుడిగా నియమితులైన పత్తిగుళ్ల ఏక్‌నాథ్ సోమవారం ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడును మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంబంగి మాట్లాడుతూ.. మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలందరినీ కలుపుకుని పార్టీకి సేవలందించాలన్నారు. మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, జేసీఎస్ ఇన్‌ఛార్జి తమ్మిరెడ్డి దామోదరరావు, బాడంగి జెడ్పీటీసీ పెద్దింటి రామారావు తదితరులున్నారు.

బాడంగి: మండలంలో వైఎస్సార్‌సీపీ అభివృద్ధికి తమవంతు కృషిచేస్తానని మండల యువజన విభాగం అధ్యక్షుడు వంగపండు రమేష్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. గ్రామాలవారీగా యువతతో సమావేశమై పార్టీ కోసం ఏవిధంగా పనిచేయాలో అవగాహన కల్పిస్తానన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో పాటు యువజన విభాగం అధ్యక్ష పదవికి తన పేరును సిఫార్సు చేసిన ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.



ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతున్న ఏక్‌నాథ్

సంక్షిప్తంగా...

శరవేగంగా రింగ్‌రోడ్డు నిర్మాణం



సంతతోట ప్రాంతంలో రింగ్‌రోడ్డు నిర్మాణం

మెంటాడ: మండల కేంద్రంలోని గ్రీన్‌ఫీల్డ్ హైవేను ఆనుకుని నిర్మాణం జరుగుతున్న రింగ్‌రోడ్డు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గ్రామంలోని పెట్రోల్‌బంక్ నుంచి సంతతోట వరకు రహదారి పనులు జోరుగా సాగుతున్నాయి. పనులు పూర్తయితే మండల కేంద్రం రూపురేఖలే మారిపోతాయని, అభివృద్ధి చెందుతుందని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మైనార్టీల మద్దతు జగన్‌కే..

బొబ్బిలి: మైనార్టీలంతా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతిస్తున్నామని, వచ్చే ఎన్నికల్లో మళ్లీ ఆయన్ను ముఖ్యమంత్రిగా గెలిపించుకుంటామని మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ మహ్మద్ నజీర్ అన్నారు. సోమవారం బొబ్బిలి వచ్చిన ఆయన పలువురు ముస్లింలను కలిసి సంక్షేమ పథకాల అమలుపై ఆరాతీశారు. ప్రతి ఒక్కరూ సంతృప్తి వ్యక్తం చేయడంతో పాటు సీఎం జగన్‌కు మద్దతు ప్రకటించారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల పరామర్శ

రామభద్రపురం: మండలంలోని దుప్పలపూడి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు శింగనపల్లి త్రినాథరావు తల్లి లక్ష్మమ్మ అనారోగ్యంతో సోమవారం మృతిచెందారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు సోదరుడు శంబంగి వేణుగోపాలనాయుడు, ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, పార్టీ నాయకులు త్రినాథ్‌ను పరామర్శించారు. లక్ష్మమ్మ మృతికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మండల సచివాలయ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు, మండల యూత్ విభాగం అధ్యక్షుడు పత్తిగుళ్ల ఏక్‌నాథ్, పీఏసీఎస్ అధ్యక్షుడు కిర్ల చంద్రశేఖర్, తదితరులు ఉన్నారు.



త్రినాథరావును పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు